## నేడు విశ్వబ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనం

**షాద్‌నగర్, ఆగస్టు 10, ప్రభాతవార్త :** షాద్‌నగర్ పట్టణంలో ఆదివారం ఉదయం 10 గంటలకు విశ్వబ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనంలో భాగంగా వివాహ పరిచయ వేదిక కార్యక్రమాన్ని పెద్దఎత్తున ఏర్పాటు చేసినట్లు విశ్వబ్రాహ్మణ సంఘం, విశ్వకర్మ ఫౌండేషన్ నిర్వాహకులు కమ్మదనం సుధాకర చారి, కొందూటి రవిచారి, అద్లూరి రవీంద్ర చారి, గోవిందు శ్రీనివాస చారి, తూంపల్లి బాల బ్రహ్మాచారిలు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక పతంజలి యోగా సెంటర్, సరస్వతి శిశుమందిర్ పక్కన ఈ వివాహ పరిచయ వేదిక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వారు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వివాహం కాని యువతీ యువకులను ఈ కార్యక్రమానికి తీసుకురావాలని ఆహ్వానించారు. ఎలాంటి లాభాపేక్ష ఆశించకుండా, రుసుములు లేకుండా కేవలం సేవా ధృక్పధంతో వివాహ పరిచయ వేదిక కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విశ్వబ్రాహ్మణ సోదరులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కమ్మదనం సుధాకర చారి పిలుపునిచ్చారు.

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త



## శక్తి పోచమ్మ విగ్రహ ప్రతిష్టాపనలో మాజీ మంత్రి సబితారెడ్డి


**మహేశ్వరం, ఆగస్టు 10, ప్రభాతవార్త :** మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మునిసిపల్ కార్పోరేషన్ ఏడవ డివిజన్ గుర్రంగూడ ఆదిత్యనగర్‌లో శ్రీశ్రీశ్రీ శక్తి పోచమ్మ విగ్రహ ప్రతిష్టాపన మరియు ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి హాజరయ్యారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని ఘనంగా సన్మానించి మెమోంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సబితకు మెమోంటోను అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

## పిచ్చికుక్క దాడిలో ఐదుగురికి గాయాలు

**యాచారం ఆగస్టు10,ప్రభాతవార్త :** పిచ్చి కుక్కల దాడిలో ఐదు మందికి తీవ్ర గాయలైన సంఘటన యాచారం కేంద్రంలో శనివారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... యాచారం మండల కేంద్రంలోని ఎల్లమ్మ గుడి కాలనీలో పిచ్చికుక్క స్వైర విహారం చేసింది.అందులో ముగ్గురు చిన్నారులు, ఒక వికలాంగుడు, గృహిణిపై వెంబ డించి దాడి చేసినట్లు తెలిపారు. స్థానికులు వారిని ప్రథమ చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స చేసే వైద్యులు అందు బాటులో లేరని బాధితులు వాపోతున్నారు.



## గ్రామ ముఖద్వారం ప్రారంభించిన మంత్రి జూపల్లి కృష్ణారావు



ముఖద్వారాన్ని ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి తదితరులు

**తలకొండపల్లి , ఆగస్టు 10 ప్రభాతవార్త** రంగారెడ్డి జిల్లా తలకొంపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డోకురి ప్రభాకర్ రెడ్డి తన సొంత నిధులతో నిర్మించిన దేవునిపడకల్ గ్రామ ముఖద్వారాన్ని గౌరవ మంత్రి వర్యులు జూపల్లి కృష్ణారావు ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి తెలంగాణ పట్టణ ఆర్థిక మరియు మౌలిక సదుపా యాల అభివృద్ధి సంస్థ చైర్మన్ మరియు జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యులు బాలాజీ సింగ్ తదితరులతో కలిసి ప్రారంభించారు. అనంతరం నరసింహారెడ్డి మాట్లాడుతూ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి తన తండ్రి డోకురి రామిరెడ్డి జ్ఞాపకార్థం చేస్తున్న ప్రజాసేవ కార్యక్రమాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ గట్ల కేశవరెడ్డి, మాజీ ఎంపిటిసి జోగు రమేష్ ప్రభాకర్‌రెడ్డి దంపతులు మాజీ ఎంపిపి లక్ష్మీదేవి రఘురాములు మాజీ ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి మాజీ సర్పంచ్ శ్రీశైలం డేవిడ్ రేన్‌రెడ్డి గుజ్జుల మహేష్ శ్రీశైలం శ్రీనివాస్‌రెడ్డి దశరథం నరసింహ్మా విష్ణు జిల్లాకాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్ యాట నరసింహ భగవాన్‌రెడ్డి మోహన్‌రెడ్డి మాజీ ఎంపిపి లు మాజీ జెడ్పిటిసిలు మాజీ ఎంపిటిసిలు మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## బాల్యానికి సంకెళ్లు!

### మారని సంచార జీవుల బ్రతుకులు

### బతుకు భారమాయ్యే.. బడి దూరమయ్యే!

**మర్పల్లి ఆగస్టు 10 ప్రభాతవార్త :** పొట్టకూటికోసం అనేక సంచార జీవులు రోజుకో ఊరి బాటపట్టడంతో వారి పిల్లలకు బడిబాట మాత్రం దూరమైంది.పస్తులు ఉండేబ్రతుకుల్లో పుట్టినబాల బాలికలు పొట్టకూటికోసం నిత్యం పడరాని పాట్లు పడుతునే ఉన్నారు.పలుకా బలుపం పట్టి బడికి పోవలసిన బాల్యంలో పొట్టకూకోసం కొందరు బాల బాలికలు పడరాని పాట్లు పడుతూ,తల్లిదండ్రులకు జీవనోపాధిలో భాగంగా కాగితాలు, ప్లాస్టిక్ బాటిల్స్ ఏరుతు,బిచ్చటన చేస్తు కాలం గడుపుతున్న బాల బాలికలెందరో,బాల్యం తీపి కల,అమ్మ గోరుముద్దలు నాన్న ప్రేమ ఆప్యాయతలు,చీకు సింత లేకుండా ఆటాపాటలతో,బొమ్మలాటలతో,ఆందమైన బాల్యం,అందరికి రాదు మరి. సద్ది అన్నమే వారికి గోరుముద్దలు,పాత బట్టలు, మాసిన జుట్టు భుజానసంచి,వాడవాడల్లో చెత్తకుప్పల్లో కాగి తాలు ఏరుతు మసుకబారిన జీవితాలు గడుపు తున్నారు. దరిద్ర రేకకు దిగువన ఉన్నా కుటుంబాలు,సంచార జీవుల కుటుంబాల్లో నేటికి పలువురు బాల బాలికలు బ్రతుకు బాట్టతప్ప, బడిబాట ఎరుగనివారు ఎందరో ఉన్నారు రోజుకో ఊరు వాడలు తిరుగుతు ప్లాస్టిక్ కాగితాలు ఏరుకొని పొట్టకూటికోసం నిత్యం పడరాని పాట్లు పడుతున్నారు.వ్యావసాయ పనిముట్లు తయారు చేసే వడ్డెరలు, పొట్టకూటికోసం ఊరూరు తిరుగుతు పాములాట,వీధి సర్కస్,ఇలా రకరకాల సంచార జీవుల పిల్లలు దుర్భారమైన బాల్యం గడుపుతున్నారు. బాల్యాన్ని గాలికి వదలి బ్రతుకు బండిని లాగుతున్న బాలకార్మి కులు నిత్యంఎక్కడో కనిపిస్తునే ఉంటారు.తల్లిదండ్రులకు కూడా పిల్లల భవిష్యత్తుపై సరైన అవగాహణలేకపోవడంతో వారితో పాటే వారి పిల్లల బ్రతుకులను కూడా ఒకేతాటిపై లాగుతున్నారు.కొందరు తల్లిదండ్రులై తమ పిల్లలను కాగితాలు ఎరడానికి, భీక్షాటణ,పనిబాటకు పంపుతూ పిల్లల బ్రతుకులను పాడుచేస్తున్నారు బాలకార్మి వ్యవస్థను రూపు మాపాలని ప్రభుత్వం, పలు స్వచ్ఛంద సంస్థలు నిత్యం శ్రమిస్తున్న సంచార జీవులలో మార్పురావడంలేదు.



చిత్తుకాగితాలు ఎరుతున్న బాలబాలిలు

# పోలీసు జాబు.. మజా కాదురా బాబు..

## షాద్‌నగర్‌లో పోలీసు విధులు కత్తిమీద సామే..
## కీలక కేసుల్లో ఇరుక్కుపోతున్న పోలీసులు..
## వేటుపడినా పోలీసుల్లో కనిపించని కనువిప్పు




షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్

**షాద్‌నగర్, ఆగస్టు 10, ప్రభాతవార్త :** షాద్‌నగర్ డివిజన్ పరిధిలో పోలీసు విధుల నిర్వహణ కత్తిమీద సామేనని ఎన్నో సందర్భాలలో రుజువైంది. పాతికేళ్ళ క్రితం నుంచి ఇప్పటిదాకా ఎన్నో సంఘటనలు పోలీసులను ఇరకాటంలో పెట్టాయి. ఎరక్కపోయి ఇరుకున్న సందర్భాలు ఎన్నో.. నయీం ఎన్‌కౌంటర్ మొదలుకొని దిశా ఎన్‌కౌంటర్ వరకు, మొన్నటి సంఘటనలో దళిత మహిళ చిత్రహింసల దాకా అన్ని రాష్ట్ర స్థాయిలో వివాదాస్పదమైనవి. 22ఏళ్లక్రితం జనవరిలో కొత్తూరు తిరుపతి స్టీల్ పరిశ్రమలో యజమాని ప్రవర్తనను ఆధారంగా చేసుకొని పోలీసులు అతనిపై చేయి చేసుకున్నారు. పవన్ గార్గ్ అనే పారిశ్రామికవేత్తను దుస్తులు విప్పించి రోడ్డు వెంట కొట్టించిన సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. అప్పట్లో వార్త దినపత్రిక ఈ అంశంపై సంచలన కథనాలను వెలువరిస్తే అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం షేక్ అయ్యింది. ఆ సంఘటనలో పోలీసులపై కేసు నమోదు అయ్యింది. పారిశ్రామికవేత్తలు పెద్దఎత్తున తరలివచ్చి పోలీసులకు వ్యతిరేఖంగా ఆందోళనకు దిగారు. దీంతో ఉన్నతాధికారులు అప్పటి షాద్‌నగర్ ఎస్సై ముత్తయ్య, మరో ఎస్సై కొత్తూరుకు చెందిన అబ్దుల్




జావీద్‌లపై సస్పెన్షన్ వేటు వేశారు. ఆ తర్వాత కూడా పలు సంఘటనలు పోలీసులకు సవాలుగా మారాయి. షాద్‌నగర్ పట్టణంలోని నెహ్రూ కాలనీకి చెందిన నీరటి అంజయ్య అనే హమాలీ లాకప్ డెత్ వ్యవహారం పోలీసుల మెడకు చుట్టుకుంది. దీంతో అప్పటి ఎస్సై అనురాధను పోలీసులు సస్పెండ్ చేశారు. అదేవిధంగా అప్పట్లో షాద్‌నగర్ పోలీస్ సర్కిల్ పరిధిలో ఉన్న బాలానగర్ పోలీస్ స్టేషన్‌లో ఓ లాకప్‌డెత్ వ్యవహారంలో అప్పటి షాద్‌నగర్ సీఐ పోశెట్టిని, మరికొంతమంది కానిస్టేబుల్స్‌ను సస్పెండ్ చేశారు. మరో సందర్భంలో రికవరీ చేసిన బంగారాన్ని మింగారంటూ కొంతమంది కానిస్టేబుళ్లను సస్పెండ్ చేశారు. నకిలీ నోట్ల వ్యవహారంలో సిఐ సైదయ్య సస్పెన్షన్ కూడా సంచలనం సృష్టించింది. మరోవైపు షాద్‌నగర్ కేంద్రంలో ఓ కేసు వ్యవహారంలో అప్పటి ఎస్సై శ్రీనివాస్ యాదవ్ సస్పెన్షన్ వేటుకు గురికాండం "వార్త"ల్లోకి ఎక్కింది. ఇంకా కొన్ని ఘటనల్లో అప్పటి మహిళ ఎస్సైలు రమాదేవి, నిర్మల లాంటి వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకున్న దాఖలాలున్నాయి. అదేవిధంగా అప్పటి కేశంపేట ఎస్సై సాయి గౌడ్ ఓ దళిత వ్యక్తి కేసులో ఓవర్‌యాక్షన్ చేసిన కారణంగా షాద్‌నగర్ పట్టణంలోని మిలీనియం టౌన్ షిప్‌లో కరుడు గట్టిన నేరస్థుడు నయీంను పోలీసులు ఎన్‌కౌంటర్ చేశారు. ఈ విషయం అప్పట్లో ఎంత పెద్ద సంచలనమో చెప్పనక్కర్లేదు. సురక్షితంగా ఇక్కడ తలదాచుకున్న నయీంను పోలీసులు పట్టుకొని కాల్చి చంపారు. ఆ తర్వాత నయీం ఎన్‌కౌంటర్ సంఘటన వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా దుమారం లేపడం, నయీం దాచుకున్న డెన్‌లో అక్రమ ఆయుధాలు, కొంత నగదు, ఆస్తులకు సంబంధించిన వివరాలు కొంతమంది పెద్దలు తీసుకున్నారనే వ్యవహారం వివాదాస్పదమైంది. ఆ తర్వాత జరిగిన పరిణామాలు అందరికీ తెలిసిందే. కొన్నేళ్ల క్రితం శంషాబాద్ తొండుపల్లిలో జరిగిన దిశ అత్యాచారం కేసులో నిందితులను షాద్‌నగర్‌లో ఎన్‌కౌంటర్ చేయడం ఎంత పెద్ద సంచలనం సృష్టించిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. షాద్‌నగర్ శివారులో చటాన్‌పల్లి వద్ద ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. దీని వెనుక అప్పటి ప్రభుత్వంతో సహా ఉన్నతాధికారులు కూడా భాగస్వాములుగా ఉన్నారు. కానీ ఈ వ్యవహారంలో ముందుకి వచ్చి ఇరికింది మాత్రం అప్పటి ఏసీపీ సురేందర్, సీఐ, ఇతర అధికారులు. అదేవిధంగా కిందిస్థాయి సిబ్బంది కూడా ఉంటారు. ఈ సంఘటన ఇంకా పోలీసుల మెడ చుట్టే ఉంది. ఇదిలా ఉండగా తాజాగా పట్టణంలోని హరిజనవాడకు చెందిన దళిత మహిళ సునీతను విచారణ పేరిట తీసుకువెళ్లి తీవ్రంగా కొట్టారు అంటూ షాద్‌నగర్ పోలీసులపై ఆరోపణలు వచ్చాయి. ఇది సంచలనంగా మారడంతో అప్పటికప్పుడు డిటెక్టివ్ సిఐ రామిరెడ్డితో పాటు, ఐదుగురు కానిస్టేబుళ్లను తాజాగా పోలీసులు సస్పెండ్ చేశారు. ఈ వ్యవహాహారంపై ఇప్పటికీ ఆందోళన కొనసాగుతోంది. పోలీసులు విధి నిర్వహణలో చట్టాల నిబంధనలను పాటించకుండా అత్యుత్సాహంతో ముందు వెళితే ఈ ప్రాంతంలో అత్యంత ప్రమాదకరమైన పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుంది. షాద్‌నగర్ నియోజకవర్గం విషయంలో ఎవరైనా సరే ఒళ్ళు దగ్గర పెట్టుకొని పని చేయాల్సిన అవసరం ఉందని ఈ సంఘటనల ద్వారా స్పష్టమవుతుంది.



షాద్‌నగర్‌లో నయీం ఎన్‌కౌంటర్ (ఫైల్)



పోలీసు బాధితురాలు దళిత మహిళ సునీత (ఫైల్)

# నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలి

## కలెక్టర్ ప్రతీక్ జైన్

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి ప్రభాతవార్త :** నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు.శనివారం వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ పరిధిలోని 14,23వ వార్డులలో గల పార్కులలో మున్సిపల్ చైర్మన్ మంజుల రమేష్‌లతో కలిసి కలెక్టర్ మొక్కలు నాటి నీళ్లు పోశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ... మానవ మనుగడకు మొక్కలే ఆధారమని,సకాలంలో వర్షాలు కురిసేందుకు చెట్లు దోహదపడతాయని పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని అన్నారు. పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ పార్కుల అభివృద్ధితో పాటు ప్రజలకు ఉపయోగ పడే వాకింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేయాలని కమిషనర్‌ను కలెక్టర్ ఆదేశించారు.పార్కుల్లో యోగ బెడ్స్‌ను,పిల్లలు ఆడుకునేందుకు వీలుగా వివిధ పరిసరాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలిపారు.వార్డుల వారీగా పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. 23వ వార్డు చిన్నారులతో పార్క్‌లో మీకు ఎలాంటి ఆట వస్తువులు కావాలని పిల్లలతో ముచ్చటించారు.మున్సిపల్ సిబ్బంది,డిఆర్‌డిఎ,ఆర్‌పిలతో మాట్లాడి వారికి ఉన్న సమస్యల వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్,కమిషనర్ జాకీర్ అహ్మద్, మున్సిపల్ కౌన్సిలర్లు,రామస్వామి, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్



పురస్కారం అందుకుంటున్న ద్యావరి నరేందర్‌రెడ్డి

## నరేందర్‌రెడ్డికి సినారే సాహిత్య పురస్కారం

**పెద్దేముల్, ఆగస్టు 10, ప్రభాతవార్త:** హైద్రాబాద్‌కు చెందిన మహకవి సినారే కళాపీఠం సంస్థ డా.సి.నారాయన్‌రెడ్డి 93వ జన్మదినం సందర్భంగాపెద్దేముల్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న గజల్ కవి ద్యావరి నరేందర్‌రెడ్డికి సినారే సాహిత్య పురస్కారంనుఆందజేశారు. శనివారం హైద్రాబాద్‌లో తుర్కయాంజల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యాక్షులు జి,చిన్నారెడ్డి,ప్రముఖ సాహితవేత్త డా.నందిని సిద్దారెడ్డి చేతుల మీదుగా అవార్డును స్వీకరించారు. తెలుగు సాహిత్యంలోని గజల్ ప్రక్రియలో రెండు దశాబ్దాల నుంచివిశేష కృషి చేస్తున్నందున ఈ అవార్డుకు నరేందర్‌రెడ్డిని ఎంపిక చేసినట్లు నిర్వహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహకవి సినారే కళాపీఠం అధ్యక్షులు మల్లెకేడి రాములు, తేజ సాహిత్య సేవా సంస్థ అధ్యక్షులు డా.పోరెడ్డి రంగయ్య, తెలంగాణ భాష సాంస్కృతిక మండలిఅధ్యక్షులు డా.గంటాజలందర్‌రెడ్డి, కౌన్సిలర్ సునీల్ తదితరులు పాల్గొన్నారు. ద్యావరి నరేందర్‌రెడ్డి సినారే సాహిత్య పురస్కారం అందుకోవడం పట్ల తాండూరు కళాభారతిసాహిత్య వేదిక అధ్యక్షులు రామక్రిష్ణరాజు, ప్రధానకార్యదర్శి బాకారం జయపాల్‌రెడ్డి, కవులు సిద్దిలింగయ్య, కోటం చంద్రశేఖర్, గాజుల పవన్‌కుమార్,పెరుమాళ్ళ వెంకట్‌రెడ్డి, జడ్‌పిహెచ్‌ఎస్ ప్రదానోపాద్యాయులు సునీత, వికారాబాద్ జిల్లా గెజిటెడ్ లెక్చరర్స్ సంఘం అధ్యక్షులు టి.మహేందర్ హర్షం వ్యక్తంచేశారు.

## అకాల మరణం చెందిన కుటుంబీకులకు ఆర్థిక సాయం

**కేశంపేట, ఆగస్టు 10, ప్రభాతవార్త:** కేశంపేట మండల కేంద్రానికి చెందిన దాసరి అంజమ్మ మృతి చెందాడు. అంజమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైరం అందించి వారి కుటుంబానికి ఆర్థిక సాయంగా కేశంపేట తాజా మాజీ జడ్పిటిసి విశాల శ్రవణ్‌రెడ్డి 5000 వేలు గాండ్రాది రమణ గౌడ్ 5000 వేలు తలసాని పవన్‌కుమార్ రెడ్డి 3000వేల అందజేశారు.



# తెలంగాణ యోగి సర్కార్‌లా ఉంది

## ఎంఐఎం ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్



కేశంపేట పోలీస్‌స్టేషన్‌లో ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్

**షాద్‌నగర్, ఆగస్టు 10, ప్రభాతవార్త :** తెలంగాణలో చూస్తుంటే యోగి సర్కార్‌లా కనిపిస్తుందని బహదూర్‌పుర ఎంఐఎం ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్ విమర్శించారు. హైదరాబాద్‌లో చెరువుల కబ్జా, అక్రమ నిర్మాణాలు తదితర అంశాల నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం శనివారం హైడ్రా ఆధ్వర్యంలో కూల్చివేతల పర్వం ప్రారం భించింది.ఈ నేపథ్యంలో ఈ కూల్చివేతలను అడ్డుకోబోయిన బహదూర్‌పుర మజ్లిస్ ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్‌ను కాప్స్ పోలీసులు పట్టుకొని బలవంతంగా రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పోలీస్ డివిజన్‌లోని కేశంపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో కేశంపేట పోలీసుల అదుపులో ఉన్న ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్‌ను కలిసేందుకు మీడియా ప్రయత్నించగా అధికారి అనుమతించలేదు. ఆ తర్వాత పోలీసులు ఎమ్మెల్యే ముబీన్‌ను విడుదల చేసిన అనంతరం షాద్‌నగర్ మీడియాతో ఆయ న మాట్లాడారు. ప్రభుత్వ భూములను కబ్జాలు చేసి ఇండ్లను కట్టుకున్నారని ఆరోపి స్తున్న ప్రభుత్వం వాటిని నిర్మించే సమయంలో రెవెన్యూ, సంబంధిత హెచ్‌ఎండీఏ, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు ఎందుకు అడ్డుకోలేదని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఎంతోమంది పేదలు సదరు స్థలాల్లో భవనాలు కట్టుకున్నాక ఈరోజు తెల్లవారుజామున పోలీసుల సహాయంతో వారి ఇండ్లను కూల్చడం ఎంతవరకు సమంజసమని ఎమ్మెల్యే ప్రశ్నిం చారు. ప్రభుత్వం బలవంతంగా ఇండ్లను ఖాళీ చేయించి అక్రమ పద్ధతుల ద్వారా ఇండ్లను కూల్చివేయడం సబబు కాదన్నారు. ఈ దౌర్జన్యాలు చూస్తుంటే ఇది తెలంగా ణనా లేక ఉత్తరప్రదేశ్ యోగి సర్కారా అన్న అనుమానాలు వస్తున్నాయని ఘాటుగా వ్యాఖ్యానించారు. అక్రమ నిర్మాణాలు చేశారని ఆరోపిస్తున్న ప్రభుత్వం మరి ఎందుకు నిబంధనల ప్రకారం బాధితులకు నోటీసులు జారీ చేయలేదని ప్రశ్నించారు. ప్రభుత్వం అధికార దర్పణంతో ఇండ్లను నేలమట్టం చేయడం మంచిది కాదన్నారు. ఉన్నపలంగా ఇండ్లను ప్రభుత్వం కూల్చివేస్తే బాధితులు ఎక్కడికి వెళ్తారని ప్రశ్నించా రు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరెస్టు నేపథ్యంలో కేశంపేటకు ఆయన అభిమానులు, కార్యకర్తలు తరలివచ్చారు.

## వైద్యం వికటించి మహిళ మృతి

### మరణించినా చెప్పని యాజమాన్యం
### ఆసుపత్రి ఎదుట ఆందోళన

**మొయినాబాద్, ఆగస్టు 10, ప్రభాతవార్త :** గోరంత గాయానికి కొండంత ఆపరేషన్‌చేసి, ఓ దివ్యాంగురాలి నిండు ప్రాణాన్ని ఓ యాజమాన్యం బలితీసుకున్న సంఘటన మొయినాబాద్ మండల పోలీస్టేషన్ పరిధిలో చోటుచే సుకుంది, వివరాలోకి వెలితే మొయినాబాద్ మండలంలోని ఎన్కెపల్లి గ్రామ రెవెన్యూలో ఓప్రైవేట్ ఆసుపత్రి ఉంది. శనివారం మొయినాబాద్ మండలంలోని అమ్డాపూర్ గ్రామానికి చెందిన సావిత్రి పోలియో బాధితురాలు (32) భర్త రమేష్ (35)



ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగిన మృతిరాలి కుటుంబీకులు గ్రామస్తులు

నిరుపేద కుటుంబం రెక్కడితే దొక్కడదు, మృతిరాలి భర్త రమేష్ ఆ ఆసుపత్రిలో గత కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్నాడు, సావిత్రికి వాకి ట్లో కాళుజారి పడి కాలుకు చిన్న గాయం అయింది, 3తేదిన వారు ఆసుపత్రికి తీసుకోని వచ్చి ఈ రోజు, రెపు అంటు 9వ తేది వరకు ఆసుపత్రిలో అడ్మిట్ చేసుకోని ఉదయం 11 గంటల సమయంలో ఆపరేషన్ కోరకు తీసుకెళ్లి తిరిగిరాని లోకానికి పంపించారు, ఇంత జరిగినా భర్తకు అక్కడ ఉన్న వారి బంధువులకు మరణ వార్త చెప్పకుండా ఇంకా వైద్యం చేస్తున్నాము, కోమాలో ఉంది అంటు సాయంత్రం 8 గంట ల వరకు చెప్పుతు మరణ వార్త గోప్యంగా ఉంచారు, అను మానంతో ఆమే భర్త రమేస్ వెళ్లి చెయిపట్టుకోని చూడగా చనిపోయిందని గుర్తించి ఎడుస్తుండగా ఒక్క డాక్టర్ వచ్చి చూసి చనిపోయి చాల సమయం అయిందని, ఆమెకు ఆపరేషన్ సమయంలో ఇచ్చిన మత్తు ఇంజక్షన్ వల్లే చనిపోయిందని గుర్తుంచాడు వెంటనే బంధువులు గ్రామస్తులు పెద్ద ఎత్తున భాస్కర ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగా రు, రాత్రంత ఎవరు చెప్పినా ఆసుపత్రి యాజమాన్యం స్పందిచక పోవడంతో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ, కమిషన్ మెంబర్ చిలకమర్రి నర్సింహ రావడంతో ఆందోళన ఉధృతంగా మారింది అక్కడ ఆసుపత్రి లోనికి వెళ్లడానికి యత్నించిన వారి బంధువులను పోలీసులు అడ్డుకోగా అక్కడె కూర్చో తెల్లరేంత వరకు నిరసనలు తెలిపారు, ఆసుపత్రి యాజమాన్యం పై చర్యలు తీసుకోని అను మతులు రద్దుచేయాలిన స్థానికులు డిమాండ్ చేస్తున్నారు, గర్భిణీలు డెలవరికి వచ్చినప్పుడు కూడ ఇంతే నర్లక్ష్యంగా ఉంటారని, పిల్లల వార్డుల్లో కుక్కలు తిరుగుతున్నా పట్టిం చుకునే నాదుడు ఉండదని, ప్రశ్నించాడానికి చుట్టుపక్కల ఎవరు ఆసుపత్రి మేంటెనెన్స్ ఉద్యోగులు కనిపించరని ఆసుపత్రి ఎప్పటికైనా చుట్టుపక్కల ప్రజలకు ప్రమాదకరమేనని అంటున్నారు.

## పంచాయతీ కార్యదర్శి దేవేందర్‌గౌడ్‌కు సంజాయిషీ నోటీసు

(వార్త ప్రభావం)

**హత్నూర ఆగస్టు 10,ప్రభాతవార్త:** వార్త దినపత్రికలో వచ్చిన కథనంకు అధికారులు స్పందించారు. ఈనెల5న, అభ్యంతరాలు పట్టించుకొని పంచాయతీ కార్యదర్శి అనే శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే.చందాపూర్ ఇంచార్జి పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన దేవేందర్‌గౌడ్‌కు ఎన్ఓసి ఇచ్చిన విషయంలో వివరణ ఇవ్వాలని నోటీస్ జారీచేసినట్లు హత్నూర ఎంపిడిఓ శంకర్ తెలిపారు.పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన వివరణ ఇచ్చాడని,దీని ప్రతులను,తదుపరి చర్యల నిమిత్తం సంగారెడ్డి జడ్పీసిఇఓకు నివేదిక సమర్పించామని అన్నారు.జిల్లా పంచాయతీ అధికారికి కూడ నివేదిక పంపనున్నట్లు ఎంపిడిఓ తెలిపారు.

## ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలను అలవర్చుకోవాలి

**అత్తాపూర్ ఆగస్టు10,ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలను అలవర్చుకోవాలని రాజేంద్రనగర్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.అత్తాపూర్ పరిధిలోని భాగ్య నగర్ శ్రీ రామచంద్ర స్వామి 27 అడుగుల విగ్రహ ప్రతిష్టాపనను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మైలర్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి పాల్గొని రామ చంద్ర మూర్తుల విగ్రహాన్ని ఆవిష్కరించారు.అనంతరం కార్పొరేటర్‌ని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ....ఇలాంటి గొప్ప అవకాశం నాకు రావడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు.స్వామివారి చల్లని ఆశీస్సులు ప్రజలందరూపై ఉండి సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో జీవితాంతం అష్టశ్వర్యాలతో ఆనం దంగా ఉండాలనా స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు.రాష్ట్రంలో సుభి క్షంగా వర్షాలు కురిసి పాడిపంటలతో ప్రజలందరూ జీవితాంతం ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో దేవలయ కమిటీ సభ్యులు వాసు, వెంకట్ రెడ్డి,విజయ స్వామి,గణేష్,దేవల కమిటీ సభ్యులు,పాల్గొన్నారు.

## రిజర్వేషన్ల సమాన పంపిణీతోనే ఉపకులాలకు న్యాయం

**సిద్దిపేట రూరల్, ఆగస్టు 10, ప్రభాతవార్త :** సుప్రీం కోర్టులో రాష్ట్ర ప్రభుత్వం నియమించిన న్యాయవాది సిద్దార్థ లూథ్రాను మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యులు, జాతీయ నాయకులు,రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య ఆధ్వర్యంలో శనివారం కలిసినట్లు పోరాట సమితి నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా సుప్రీం కోర్టు న్యాయవాది సిద్దార్థ లూథ్రాను శాలువాలతో ఘనంగా సత్కరించినట్లు తెలిపారు. ఎస్సీలలోని 59 కులాలకు సమానంగా రిజర్వేషన్లు పంపిణీ జరగాలని అప్పుడే మాదిగ, మాదిగ ఉపకులాలకు న్యాయం జరుగుతుందని సుప్రీం కోర్డు న్యాయవాది తెలిపినట్లు తెలిపారు. 30 యేండ్లుగా చేసిన పోరాట ఫలితం ఫలిస్తుందన్నారు. కార్యక్రమంలో జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్, తెలంగాణ న్యాయవాదుల సంఘం నాయకులు కొమ్ము ప్రవీణ్‌కుమార్,రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పులిజాల గెలువయ్య, కేదాసి మోహన్, యాదగిరి, మల్లె పోగు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# కాంగ్రెస్ కోతల ప్రభుత్వం



సిఎం సహాయ నిధి చెక్కులను పంపిణీలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు

**-ప్రజలకు ఏ కష్టం వచ్చిన ఎల్లప్పుడు అందుబాటులో ఉంటా**

**-మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎగవేత..కోతల ప్రభుత్వంగా మారందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో శనివారం 217 మంది లబ్దిదారులకు రూ.49 లక్షల 91 వేల సిఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అబద్దాలు..మోసం మాటలతో అ ధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేయడమే పనిగా పెట్టుకుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరు చెవుటోని ముందు శంఖం ఉదినట్లుగా ఉందన్నారు.కాంగ్రెస్ పాలనలో ఎరువులకు సైతం రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లిద్దామంటే డబ్బులు లేవన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు, ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాలలో పని చేసే కార్మికులకు 8 నెలల నుంచి వేతనాలు దిక్కులేవన్నారు. పెన్షన్లు, రైతుబంధు,కళ్యాణ లక్ష్మీ లక్షరూపాయాలతో పాటు తులం బంగారం హామీ అడ్రస్ లేదన్నారు. 4 వేల పెన్షన్‌కు దిక్కులేదు కెసిఆర్ ఇచ్చిన పెన్షన్ రాక రెండు నెలల నుంచి వృద్దులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కళ్యాణ లక్ష్మీ చెక్కులు రాక 8 నెలల రావడం లేదన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేకపోవడంతో దోమలు, ఈగలు వృద్ధి చెంది ప్రజలు డెంగ్యూ తదితర వ్యాధుల బారిన పడు తున్నారని తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు ఏ కష్టం వచ్చిన ఎల్లప్పుడు అందు బాటులో ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కనక రాజు, పార్టీ శ్రేణులు గుండు భూపేష్, సాయిరాం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# రైతులు పాడి పశువుల పెంపకంపై దృష్టి పెట్టాలి

**-మారుతున్న కాలానికి అనుగుణంగా పంటలు సాగు చేసుకోవాలి**

**-రాష్ట్ర రవాణా,బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

**అక్కన్నపేట,ఆగస్టు 10,ప్రభాతవార్త**

రైతులు పాడి పశువుల పెంపకంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని రాష్ట్ర రవాణా,బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.శనివారం అక్కన్నపేట మండలంలోని రామవరం,మల్లంపల్లి గ్రామాలలోని రైతు వేదికల్లో వ్యవసాయ అనుబంధ రంగాల పథకాలపై అధికారులు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించగా ఈ కార్యక్రమానికి మంత్రి ముక్య అతిధిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు మారుతున్న కాలానికి అనుగుణంగా వాణిజ్య పంటలు సాగు చేస్తూ అధిక లాభాలు వచ్చే పంటలను సాగుచేసుకోవాలని సూచించారు.దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రైతులకు రుణమాఫీ చేస్తున్నామని అందులో భాగంగా ఇప్పటికే ఒక లక్ష 50వేల లోపు రుణాలు అన్ని మాఫీ చేశామని,వచ్చే వారం రోజుల్లో 2లక్షల వరకు ఉన్న రుణాలు చేసం మాఫీ చేస్తున్నట్లు ప్రకటించారు.గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేసేందుకు ప్రభుత్వం 431.50 కోట్లు మంజూరు చేసిందని త్వరలోనే ప్రాజెక్టు పనులు పూర్తి చేసి నియోజకవర్గంలో ఒక లక్ష 6వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ ఆర్డీవో రాంమూర్తి,తహశీల్దార్ అనంతరెడ్డి,మండల ప్రజాపరిషత్ అధికారి జయరాంనాయక్,ఏపిఎం శ్రీనివాస్,ఏవో నాగరాజు,సిడిపివో జయ, కాంగ్రెస్ మండల అధ్యక్షులు జంగపల్లి ఐలయ్య,సింగిల్ విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య, బుర్ర ప్రభాకర్‌గౌడ్,నాయకులు ముత్యాల సంజీవరెడ్డి, రమేష్, మోహన్ కుమార్,పొంద్రాల దాము,సీను,రాకేష్, నవీన్,నవీన్,ఉపేందర్,తిరుపతితో పాటు తదితరులు పాల్గొన్నారు.

## స్వామి వారిని దర్శించుకున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి



స్వామి వారిని దర్శించుకుంటున్న అడిషనల్ జిల్లా కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

**కొమురవెల్లి, ఆగస్టు 10, ప్రభాతవార్త :**

సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మండల కేంద్రంలోని శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామిని శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఈవో బాలాజీ,ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్,పర్యవేక్షకులు సురేందర్ అడిషనల్ కలెక్టర్‌కు స్వామి వారి శేషవస్త్రం,ప్రసాదం అందించారు.

## ప్లాస్టిక్ రహిత భారత్ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలి

**-ఎస్సీ, ఎస్టీ రాష్ట్ర కమిషన్ చైర్మన్ వెంకటయ్య**





విలేజ్ బ్యాగ్‌ను ప్రారంభిస్తున్న ఎస్టీ, ఎస్సీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

**మిరుదొడ్డి, ఆగస్టు 10, ప్రభాతవార్త :**

ప్లాస్టిక్ రహిత భారత్ నిర్మాణంలో ఎర్త్ ఫౌండేషన్ చేపట్టిన విజేల్ బ్యాగ్ ఒక గొప్ప ముందడుగని రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. భూంపల్లి-అక్బర్‌పేట మండల పరషత్ ప్రాథమిక పాఠశాలలో ఎర్త్ ఫౌండేషన్ శనివారం చేపట్టిన ప్లాస్టిక్ రహిత భారత్ నిర్మాణంలో ఆయన పాల్గొని విలేజ్ బ్యాగ్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎర్త్ ఫౌండేషన్ విద్యతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించేందుకు గొప్ప కార్యక్రమాన్ని భూంపల్లిలో ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలన్నారు. ప్లాస్టిక్ వినియోగంతో అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. కార్యక్రమంలో జిల్లా సెక్టర్ అధికారి భాస్కర్,మండల నోడల్ అధికారి అంజగౌడ్,పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాస్, వివో మహిపాల్,అమ్మ అదర్శ కమిటీ చైర్మన్ గౌతమి, ఎర్త్ ఫౌండేషన్ కో-అర్డినేటర్ అంజనేయలు,రాజు,నీహారిక, ప్రశాంత్, ఇమ్రాన్, విద్య వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## చాకరిమెట్ల అంజన్నకు ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

**శివ్వంపేట, ఆగస్టు10 ప్రభాతవార్త:**

మెదక్ జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శివ్వంపేట మండలంలోని చిన్నగొట్టిముక్కుల గ్రామ శివారులో గల చాకరిమెట్ల సహకార ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రావణ శనివారం పురస్కరించుకొని ఆలయ ఫౌండర్ చైర్మన్ ఆంజనేయశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజనేయ స్వామి దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఫౌండర్ చైర్మన్ ఆంజనేయ శర్మ మాట్లాడుతూ శ్రావణ మాసం పురస్కరించుకొని ఆంజనేయ స్వామి విశేష పూజలు జరుగుతున్నాయని, ఈ శ్రావణమాసంలో ఆంజనేయ స్వామిని దర్శించుకున్న వారికి కోరిన కోరికలు తీరుతాయని ఆయన అన్నారు. శ్రావణ మాసం మొదటి శనివారం కావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు కొడకంచి సత్యాగౌడ్ జ్ఞాపకార్థం సత్యాగౌడ్ కుమారుడు కొడకంచి శ్రీనివాస్‌గౌడ్, కొడకంచి రవీందర్‌గౌడ్, కొడకంచి నర్సింలుగౌడ్లఉ భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు దేవదత్తు శర్మ, ప్రభురాజ శర్మ, శ్రీవాస్తవ శర్మ, ఆలయ సిబ్బంది రామకృష్ణ, శ్రీణివాస్, ప్రకాష్, భక్తులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్ బాధితునికి అప్పగింత

**మర్కూక్, ఆగస్టు 10 (ప్రభాతవార్త):**

మర్కూక్ మండలం చిన్నకిష్టాపూర్ గ్రామానికి చెందిన జైపాల్‌రెడ్డి తన మొబైల్‌ఫోన్‌ను పోగొట్టుకోగా మర్కూక్ పోలీస్‌స్టేషన్‌లో దరఖాస్తు ఇచ్చాడు. పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్‌ను ఐఎంఈఐ నెంబర్‌ను ఎంటర్ చేసి బ్లాక్ చేసి కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన సీఈఐఆర్ టెక్నాలజీతో ఫోన్‌ను స్వాధీనం చేసుకొని బాధితునికి అప్పగించినట్లు ఎస్ఐ దామోదర్ తెలిపారు.

# పుణ్యక్షేత్రం ఏడుపాయల్లో దొంగల బీభత్సం

**-హుండీలను ఎత్తుకెళ్లి సొత్తు చోరీ**

**-సెక్యూరిటీ, సిసి కెమెరాలున్నా పనితనం సున్నా**

**పాపన్నపేట, ఆగస్టు 10, ప్రభాతవార్త:**

భక్తులు తమ మొక్కుబడిలో భాగంగా అమ్మవారికి హుండీలో సమర్పించున్న నగదును గుర్తు తెలియని దొంగలు తస్కరించుకపోయారు. పవిత్ర పుణ్య క్షేత్రమైన ఏడుపాలయ వనదుర్గా భవాని మాత ఆలయంలో శుక్రవారం రాత్రికి ఇరువురు దొంగలు మండపంలోకి ప్రవేశించి 2 హుండీలను తీసుకెళ్లి ఆలయ ఆవరణలోని పాత కళ్యాణ కట్ట, మరుగుదొడ్డి సమీపంలో హుండీలను ధ్వంసం చేసి నగదు, ఆభరణాలను అపహరించుకుపోయారు. ఆలయ మండపంలో 7 హుండీలు ఉండగా మరో రెండు హుండీలు ఆలయ గర్బగుడిలో ఉన్నాయి. నిత్యం మాదిరిగానే ఆలయ అర్చకులు రాత్రికి ఆలయాన్ని మూసి వెళ్లారు. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో ఇరువురు దొంగలు (సిసి కెమెరాల్లో రికార్డు) మండపం గ్రిల్ తాళం తీయకుండా గ్రిల్‌ను తొలగించి మండపంలోకి ప్రవేశించి 2 హుండీలను తీసుకెళ్లి నగదును తస్కరించుకుపోయారు. ఆలయ హుండీలను జులై 30న లెక్కించడంతో హుండీలో కేవలం 10 రోజులు భక్తులు సమర్పించిన నగదు, ఆభరణాలే ఉంటాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ తన సిబ్బందితో ఆలయానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించి సిసి పుటేజిలను పరిశీలించగా ఇరువురు గుర్తు తెలియని దొంగలు ముసుగులు ధరించి చోరీలకు పాల్పడ్డట్లు తెలుస్తోంది. త్వరలోనే దుండగులను పట్టుకుంటామని ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు.



ఆలయ హుండీని దోచుకుని ఆలయం బయట పారేసిన దుండగులు

**-సిసి కెమెరాలు, సెక్యూరిటీ ఉన్నా పనితనం సున్నా...**

భక్తుల కోరికలు తీరుస్తున్న ఏడుపాయల వనదుర్గా భవాని మాత ఆలయానికి భద్రత కరువైందని చెప్పడం అతిశయోక్తి కాదు. ఏడాడికి కోట్లాది రూపాయల ఆదాయం సమకూరుస్తున్న ఏడుపాలయ వనదుర్గా భవాని మాత ఆలయానికి సరైన భద్రత లేక తరుచూ దొంగతనాలు చోటు చేసుకుంటున్నా నివారణ చర్యలు కరువైనాయి. గతంలో దుండగులు ఆలయ గర్భాలయంలోకి చొరబడి హుండీని ద్వంసంచేసి ఆభరణాలతో పాటు నగదును దమకెళ్లిన విషయం పాఠకులకు విధితమే. అప్పట్లో పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి దొంగలను 24 గంటల్లోనే పట్టుకుని చోరీ సొత్తును రికవరీ చేశారు.

**-చోరీ జరిగినా పత్తాలేని ఆలయ ఈఓ...**

ఆలయంలో శుక్రవారం రాత్రికి చోరి జరిగినా ఆలయ ఈఓ ఇంచార్జిడిసీ కావడంతో అదనపు బాధ్యతల సాకుతో ఆలయానికి రాలేకపోయారు. అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నా దొంగతనం చోటు చేసుకుంటే ఈఓ ఆలయానికి రాకపోవడం ఏమిటని భక్తులు మండిపడుతున్నారు. ఆలయ ఈఓకు అదనపు బాధ్యతలు అప్పగించడంతో ఆలయ సిబ్బంది సైతం తమ ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారని, ఆలయ అభివృద్ధి కుంటు పడుతోందని భక్తులు మండిపడుతున్నారు. ఏదేమైనా ఆలయంలో పటిష్ట భద్రత ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని భక్తులు సూచిస్తున్నారు.

## నులి పురుగుల నివారణతో ఆరోగ్యం : మున్సిపల్ చైర్మన్



విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలను వేస్తున్న మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి

**అమీన్‌పూర్, ఆగస్టు10 ప్రభాతవార్త:**

చిన్నపిల్లల నుండి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరూ నులి పురుగుల నివారణ మాత్రలు వేసుకోవాలని, ఆరోగ్యంగా ఉండాలని అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి తెలిపారు. జాతీయ ఫైలేరియా, నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని మహిమా మినిస్ట్రీస్ అనాథ ఆశ్రమంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థినీ విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలను పంపిణీ చచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోధకాల వ్యాధిని నిరోధించేందుకు పాఠశాల స్థాయి నుండే మాత్రలు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, చేతుల శుభ్రత పాటిస్తే నులి పురుగులు వ్యాప్తి చెందకుండా అరికట్టవచ్చని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కృష్ణ, కోఆప్షన్ సభ్యులు తలారి రాములు, సీనియర్ నాయకులు భాస్కర్‌రెడ్డి, లింగంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు

**-ఇద్దరి పరిస్థితి విషమం..**

**టేక్మాల్,ఆగస్టు 10, ప్రభాతవార్త:**

161 జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలై ఇద్దరికి పరిస్థితి విషమంగా ఉన్న సంఘటన టేక్మాల్ మండల పరిధిలోని బొడ్మట్‌పల్లి శివారులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే ఈ విధంగా ఉన్నాయి. 161 జాతీయ రహదారి ఇరు పక్కలో నాటిన మొక్కలకు నీళ్ల పట్టేందుకు నిలిపి ఉన్న నీళ్ల ట్యాంకర్‌ను జోగిపేట వైపు నుండి అతివేగంగా వస్తున్న ఆటో వచ్చి ట్యాంకర్ వెనుక భాగంలో ట్యాంకర్‌తో నీళ్ల పడుతున్న శ్రీనివాస్ అనే వ్యక్తిని డీకొని ట్యాంకర్ కిందకు ఆటో దూసుకెళ్లింది. ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. హైవే పెట్రోలింగ్ సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని జెసిబి సహాయంతో గాయపడిన ఇద్దరిని బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. ట్యాంకర్ నీళ్ల పడుతున్న వ్యక్తి శ్రీనివాస్ పెద్ద శంకరంపేట మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తిం చారు. ఆటోల ఉన్న వ్యక్తి రాజు వట్‌పల్లి మండలం పోతులబొగుడ గ్రామానికి చెందిన వ్యక్తి అని గుర్తించారు. మరో ఇద్దరి వివరాలు తెలియాల్సి ఉంది.

## గంజాయి పెంచిన రాథోడ్ తుకారామ్‌కు రిమాండ్

**-పత్తి పంటలో అంతర్‌పంటగా గంజాయి సాగు**

**సిర్గాపూర్, ఆగస్టు 10, ప్రభాతవార్త:** పత్తి పంటలో ఆంతర్ పంటగా గంజాయిని సాగు చేస్తున్న రాథోడ్ తుకారం (30)ను అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని వాసర్ గ్రామ శివారులో చందర్ నాయక్ తండాకు చెందిన రాథోడ్ తుకారాం తను సాగు చేసుకుంటున్న పత్తి పంటలో అంతర్‌పంటగా గంజాయి మొక్కలను సాగు చేసుకుంటున్నాడన్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు సిబ్బందితో ఎస్ఐ వ్యవసాయ పొలాన్ని పరిశీలించగా 30 గంజాయి మొక్కలను గుర్తించామన్నారు. గంజాయి మొక్కలను సీజ్ చేసి తుకారంను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. గంజాయి సాగు చేస్తున్న వ్యవసాయ భూమిపై, బాధిత రైతుకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలైన రైతు బంధు, పంట రుణాలు ఇవ్వకపోవడం, రుణాలను మాఫీ చేయడం ఆపేస్తారన్నారు. గంజాయి మొక్కలు పెంచితే కఠిన చర్యలు తప్పవని, అందుకు గంజాయిని పెంచుకుంటున్న రైతులు వెంటనే స్వచ్చదంగా మొక్కలను ద్వంసం చేసుకోవాలని ఎస్ఐ హితువు పలికారు.

# చందాపూర్‌లో కుంట మాయం

**-తనిఖీలో అవాక్కైన అధికారులు**



రోడ్డుగా మారిన కుంటను పరిశీలిస్తున్న రెవెన్యూ,ఇరిగేషన్ అధికారులు

**హత్నూర ఆగస్టు 10,ప్రభాతవార్త:**

ఇరిగేషన్‌శాఖ పరిధిలోని కుంటలు,నామరూపాలులేకుండా పోతున్నా సంబందిత శాఖ అధికారుల్లో చలనంలేకుండా పోతుంది..ఉన్నాతాదికారులు అదేశిస్తేతప్ప తమపరిధిలోని కుంటల పరిస్థితిఏంటో తెలియని పరిస్థితి నెలకొంది హత్నూర. మండలంలోని చందాపూర్,చింతల్‌చెరువు గ్రామాలలో కుంటలు నామరుపాలు లేకుండా పోవడంతో నివ్వేరపోవడం అధికారుల వంతైంది.జిల్లా ఉన్నాతాదికారుల అదేశాలతో చందాపూర్,చింతల్‌చెరువు గ్రామాలలో ఇరిగేషన్ రెవెన్యూ అధికారులు మండల సర్వేయర్ శ్రీనివాస్,ఇరిగేషన్ డిఇ రవికుమార్,ఎఇ భూపుత్రలు సంయుక్తంగా కుంటలను పరిశీలించారు.రికార్డుల ప్రకారం పరిశీలించిన అధికారులకు కుంటల జాడనే కనిపించలేదు. కుంటల కట్టలను చెరిపేసి రోడ్డుగా మార్చడంతో అధికార్దుల అవాక్కుకావలసి వచ్చింది.ప్రభుత్వ రికార్డుల ప్రకారం చందాపూర్ గ్రామంలో పాతబావి నల్లకుండా ఉంది.దాని సర్వేనెంబర్ 90 పరిధిలో 9ఎకరాల9గుంటల భూమీ ఉంది. అధికారుల పర్యటనలో సంబందిత కుంట నామరుపాలు లేకుండా పోయింది. కుంటకట్ట స్థానంలో రోడ్డు ఏర్పాటైంది. కట్టను,తూమును తొలిగించి రోడ్డు ఏర్పాటు చేసినట్లు అధికారులు గుర్తించారు. చింతల్ చెరువు గ్రామం పరిదిలోని నడప్పగారి కుంట కూడ నామరుపాలు లేకుండా పోయింది.దీని పరిధిలో 19ఉకరాల 8గుంటల భూమీ ఉంది.ఇక్కడ కూడ కుంటకట్టను తొలిగించినట్లు అధికారులు గుర్తించారు.ఈవిషయమై ఇరిగేషన్ డిఇ వికుమార్‌ను వివరణ కోరగా చందపూర్ గ్రామం పరిధిలోని పాతబావి నల్లకుంట,చింతల్ చెరువులోని నడప్పగారి కుంటలు నిభంధనలకు విరుద్ధంగా తొలిగించారని అన్నారు.కుంట పరిధిలోని భూమీ పట్టాభూమీ అయిన ప్రభుత్వ కుంటకట్టలను తొలిగించే అధికారంలేదని అన్నారు.నీటి నిల్వకు అవసరమైన కట్టలను, తొలిగించడం చట్టవిరుద్దమని అన్నారు.జియోట్యాగ్ చేసి,అనంతరం కుంటలను యతస్థితిలోకి తెచ్చేవిధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు.

**భాద్యులపై క్రిమినల్ కెసునమోదు చేయాలి**

**: మాజీ ఎంపిటిసి రాజేందర్ డిమాండ్**

చందాపూర్‌లోని పాతబావి నల్లకుంట కట్టను చట్టవిరుద్దంగా తొలిగించిన వారిపై క్రిమినల్ కెసులు నమోదు చేసి,శాఖపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక మాజీ ఎంపిటిసి,మండల ఎంపిటిసిల ఫోరం మాజీ అధ్యక్షులు టి.రాజేందర్ డిమాండ్ చేశారు.కట్టను యదాస్థితిలోకి వచ్చేల అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

# భక్తులతో సందడిగా మారిన నాచగిరి



స్వామివారి దర్శనానికి బారులుతీరిన భక్తులు

**వర్గల్, ఆగస్టు 10 (ప్రభాతవార్త):**

వర్గల్ మండలం నాచగిరి శ్రీ లక్ష్మీనృసింహస్వామి క్షేత్రం శ్రావణమాసం మొదటి శనివారం కావడంతో భక్తులతో సందడిగా మారింది. ఆలయానికి వివిధ ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే ఆలయంలో స్వామివారి నిత్య కళ్యాణాలు 4, నిజాభిషేకాలు 10, శ్రీ సత్యనారాయణస్వామి వ్రతాలు 30 మంది జంటలు ఆచరించడం జరిగిందని ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపూర్ణ పేర్కొన్నారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

## రాజీవ్‌రహదారిపై గొర్రెలను ఢీకొట్టిన కంటైనర్

**-15 గొర్రెలు మృతి, 20 గొర్రెలకు తీవ్ర గాయాలు**



మృతిచెందిన గొర్రెలను పరిశీలిస్తున్న పోలీసులు

**గజ్వేల్ టౌన్, ఆగస్టు 10 (ప్రభాతవార్త):**

గజ్వేల్ మండలం కొడకండ్ల రాజీవ్‌రహదారిపై మేతకు వెళ్తున్న గొర్రెల పైకి కంటైనర్ లారీ దూసుకెళ్లడంతో 15 గొర్రెలు అక్కడికక్కడే మృతిచెందగా 20 గొర్రెలకు తీవ్ర గాయాలయ్యాయి. కొడకండ్ల గ్రామానికి చెందిన కోరె మల్లయ్య, బీడ భూమయ్యలకు చెందిన గొర్రెలను మేత కోసం రాజీవ్‌రహదారి దాటిస్తుండగా నాగపూర్ నుంచి హైద్రాబాద్‌కు సిమెంట్ లోడుతో వెళ్తున్న కంటైనర్ లారీ అదుపుతప్పి గొర్రెలపైకి దూసుకెళ్ళింది. 15 గొర్రెలు మృతిచెందగా 20 గొర్రెలు తీవ్ర గాయాలు కావడంతో సుమారు రూ.3 లక్షల వరకు ఆస్తినష్టం జరిగినట్లు గొర్రెల యజమాని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న కుకునూర్‌పల్లి ఎస్ఐ బి.శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.